మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట





మోడల్ హౌస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

## ఆకర్షణీయంగా మోడల్ హౌస్

**పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం..**

**ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే యెన్నం**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 24 ప్రభాతవార్త:** హన్వాడ మండలం తహశీల్దార్ ప్రాంగణంలో గృహ నిర్మాణ శాఖ రూ.5లక్షల వ్యయంతో నిర్మాణం చేసిన ఇందిరమ్మ మోడల్ గృహంకం. గృహ నిర్మాణ ఏఈ కార్యాలయాన్ని మహబూబ్‌నగర్ శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు స్వంత ఇంటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ గృహాలను నిర్మాణం చేసేందుకు లబ్ధిదారులకు రూ.5 లక్షలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. నూతన టెక్నాలజీతో రూ.5 లక్షల వ్యయంతో ఆకర్షణీయంగా మోడల్ హౌజ్‌ను నిర్మాణం చేసినట్లు ఆయన తెలిపారు. గృహ నిర్మాణ పి.డి.వైద్యం భాస్కర్ మాట్లాడుతూ 5 లక్షల వ్యయంతో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో పిల్లర్ రూఫింగ్ టెక్నాలజీతో పర్యావరణ హితంగా రూఫ్‌నిర్మాణంలో మట్టికుండల మూతలు ఉపయోగించినట్లు తెలిపారు. ఈ మూతలు వాడడం వలన 3 నుండి 5 డిగ్రీలు -మిగతా3లో..

## ర్యాగింగ్ నేరం

**విద్యాలయాల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలి**

**ర్యాగింగ్ ను పూర్తిగా నిషేదించాలి : ఎస్పీ డి. జానకి**


**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 24 ప్రభాతవార్త:** కళాశాలలో ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి హెచ్చరించారు. క్రిమినల్ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ర్యాగింగ్ ఒక తీవ్రమైన నేరమని పేర్కొన్నారు.



రాగింగ్‌లో పాల్గొనే విద్యార్థులు తక్షణమే కాలేజీ నుండి బహిష్కరణకు గురవుతారు. అదనంగా క్రిమినల్ కేసులు నమోదై వారి విద్య, ఉద్యోగ, భవిష్యత్తు అవకాశాలు ప్రభావితమవుతాయని హెచ్చరించారు. ప్రతి ఉన్నతవిద్యాసంస్థలో యాంటీర్యాగింగ్ కమిటీలు, స్క్వాడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు.కొత్త విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని,అవగాహన కార్యక్రమాలు,సెమినార్లు, వర్క్‌షాప్‌లు నిరంతరంగా నిర్వహించాలన్నారు.విద్యార్థులు సహ విద్యార్థులపై ఎటువంటి వేధింపులు,అనుచిత ప్రవర్తనలు చేయకూడదని సూచించారు. ర్యాగింగ్ ఘటనలు ఎదురైతే బాధితులు తక్షణమే ప్రిన్సిపాల్, కళాశాల యాజమాన్యం లేదా పోలీసులను సంప్రదించాలని పిలుపునిచ్చారు. విద్యాసంస్థల యాజమాన్యం,అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసులు కలిసి ర్యాగింగ్ పూర్తిగా నిర్మూలించడానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు.

## గవినోల్ల కృష్ణారెడ్డికి ఘన నివాళి

**చిన్నచింతకుంట,మహబూబ్‌నగర్ ఆగస్టు 24 ప్రభాతవార్త:** దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూద న్‌రెడ్డి తండ్రి కీ.శే.గవినోళ్ళ కృష్ణా రెడ్డి మొదటి వర్ధంతి ఆదివారం దేవరకద్ర నియోజకవర్గంలోని దమగ్నాపూర్ గ్రామంలోని వారి నివాసంలో జరిగింది. కార్యక్రమానికి రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, యువజన క్రీడలుశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గవినోళ్ళ కృష్ణారెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, డిసిసిబి చైర్మన్ విష్ణువర్దన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్‌పి వెంకటేష్, మారేపల్లి సురేందర్ రెడ్డి, జహీర్ అక్తర్, అవేజ్, అజ్మత్ అలి, తదితరులు ఉన్నారు.



కృష్ణారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీహరి, ఎమ్మెల్యే యెన్నం, చిత్రంలో ఎమ్మెల్యే జిఎంఆర్, డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, సురేందర్ రెడ్డి

# ప్రజా సంక్షేమానికి పెద్ద పీట

- పేదల కోసం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు
- గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన
- పంచాయతీరాజ్ శాఖ మాత్యులు సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క



గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

**అచ్చంపేట, ఆగస్టు 24 ప్రభాతవార్త:** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజాపాలనను కొనసాగిస్తూ రాష్ట్రంలో బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసి ముందుకు సాగుతున్నామని పంచాయతీరాజ్ శాఖ, శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు సీతక్క పేర్కొన్నారు. ఆదివారం అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం మాధవనిపల్లి, కుమ్మరొనిపల్లి గ్రామాల్లో రూ.20 లక్షలతో ఒక్కొక్క గ్రామపంచాయతీ భవనాలను నిర్మించేందుకు తెలంగాణ రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు సీతక్క, స్థానిక శాసన సభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణలు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 6 గ్యారంటీ పథకాలను అమలు చేస్తూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా నెరవేరుస్తూ రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేసి బడుగు బలహీన వర్గాల ప్రజలకు 3 పూటల భోజనాన్ని అందిస్తూ పేదోడి ఆకలి తీరుస్తున్నామని ఆమె తెలిపారు. మహిళలకు ఇచ్చిన మాట ప్రకారంగా ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తూ మహిళ అభ్యున్నతికి మహిళా సంఘాల ద్వారా రుణాలను అందిస్తూ మహిళలకు పెద్దపీట వేస్తున్నామని మంత్రి గుర్తు చేశారు. గ్రామాల అభివృద్ధికి సిసి రోడ్లు, వాగులపై వంతెన నిర్మాణాలను చేపట్టి ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా చేస్తూ రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగిస్తున్నామన్నారు. పేదింటి విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించడంతోపాటు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే విద్యార్థులకు నాణ్యమైన విధిని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అచ్చంపేట నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి పరిచి మోడల్ అచ్చంపేటగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. నల్లమల ప్రాంతంలో జీవిస్తున్న ప్రజలకు విద్య వైద్య రంగాలలో ఎలాంటి కొరత లేకుండా చూస్తున్నామని అన్నారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు.అమ్రాబాద్ మండలంలోని మాధవనిపల్లి గ్రామంలో ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరించి భూమి పూజ చేశారు. పేదల కోసం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం తదితర పథకాలను అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాయిని జైపాల్, అచ్చంపేట యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు క్యామ మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కోనేరు సుందరీకరణ పనులకు శ్రీకారం చుడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి

## కోనేరును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతా..

**జాతర బ్రహ్మోత్సవాల్లో మంత్రి వాకిటి శ్రీహరి**

**మక్తల్ టౌన్, ఆగస్టు 24 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణంలో పడమటి ఆంజనేయస్వామి దేవస్థానం పురాతన కోనేరును మంత్రి వాకిటి శ్రీహరి సందర్శించారు. రాబోయే పడమటి ఆంజనేయస్వామి జాతర బ్రహ్మోత్సవాల నాటికి కోనేరును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, భక్తులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర పశుసంవర్ధక, డైరీ అభివృద్ధి, క్రీడలు, యువజన సేవలు మత్స్యశాఖ డా. వాకిటి శ్రీహరి హామీ ఇచ్చారు. ఆదివారం ప్రత్యేక పూజలు చేసి మంత్రి పడమటి ఆంజనేయస్వామి ఆలయ కోనేరు సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ -కోనేరును గతంలో ఎవరూ పట్టించుకోకపోవడం వల్ల అపరిశుభ్రంగా మారిందని,ఇప్పుడు తిరుమల, యాదగిరిగుట్ట స్థాయిలో సుందరీకరణ చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని,రాబోయే జాతరలో భక్తులు కోనేటిలో స్నానం చేసి స్వామివారిని దర్శించుకునే వీలు కల్పిస్తామని అన్నారు. ఈ పనులు పూర్తిగా ఎమ్మెల్యే సొంత నిధులతో జరుగుతున్నాయి. ప్రముఖ ఆర్కిటెక్ట్ కల్పన పర్యవేక్షణలో కోనేరు అభివృద్ధి జరుగుతోందని పట్టణ ప్రజలు, భక్తులు సైతం భాగస్వాములు -మిగతా3లో..

# అనర్హులకు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తే కఠిన చర్యలు..

**మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరిక గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ప్రజా ప్రభుత్వ లక్ష్యం**

**వీపనగండ్ల ఆగస్టు 24, ప్రభాతవార్త;** వీపనగండ్ల మండల కేంద్రం నుంచి బెక్కెం గ్రామానికి రూ. 3.90 కోట్లతో నిర్మించనున్న బీటీ రహదారికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా బొల్లారం గ్రామంలో పల్లె దావకాన 20 లక్షలతో నిర్మించినటువంటి భవనాన్ని ప్రారంభించారు. అదేవిధంగా వీపనగండ్ల బొల్లారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా అబ్కారి, పర్యాటక, సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తే అధికారులపై కఠిన చర్యలు తప్పవని ఆయన అధికారులను హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్దే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం ప్రజలకు ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని అన్నారు. ఆదివారం వీపనగండ్ల మండల కేంద్రంలో పర్యటించిన మంత్రి జూపల్లి కృష్ణారావు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్ తో కలిసి వీపనగండ్ల మండల కేంద్రం నుంచి బెక్కెం గ్రామానికి రూ. 3.90 కోట్లతో నిర్మించనున్న బీటీ రహదారికి మంత్రి శంకుస్థాపన చేశారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ వీపనగండ్ల మండల కేంద్రం నుంచి బెక్కెం వరకు నిర్మించనున్న బీటీ రహదారిని నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందంజలో నిలపడమే లక్ష్యమని తెలిపారు. గతంలో తాను పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు నియోజిక వర్గం లో రూ. 300 కోట్లతో సిసి రహదారులు, రూ. 600 కోట్లతో బీటీ రహదారులు నిర్మించే అభివృద్ధి చేసినట్లు గుర్తు చేశారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తన సహకారం ఉంటుందని చెప్పారు. మండల పరిధిలోనీ నాలుగు ఎకరాల ఆయన సొంత భూమిని మండల కేంద్రంలో స్పోర్ట్స్ కు ఉచితంగా ఇస్తున్నట్లు ,అభూమిలో, స్పోర్ట్స్ కోసం స్టేడియాన్ని ఏర్పాటు చేయించేందుకు అన్ని రకాలుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. నిరుపేద మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రారంభించిన ఇందిరా మహిళా శక్తి పథకం కింద మైనారిటీ శాఖ ఆధ్వర్యంలో మంజూరైన కుట్టు మిషన్లను 19 మంది మైనారిటీ నిరుపేద మహిళా లబ్ధిదారులకు మంత్రి అందజేశారు. వాటిని సద్వినియోగం చేసుకొని, ఉపాధి పొందాలని వారికి సూచించారు.వీపనగండ్ల మండల కేంద్రంలో అలివేల, బొల్లారం గ్రామ పరిధిలో మంజుల, రాధా అనే లబ్ధిదారులకు చెందిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు మంత్రి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ సెక్రెటరీ రమేష్ రెడ్డి కి ఆదేశిస్తూ అనారులకు ఇందిరమ్మ ఇళ్ళను ఇస్తే తక్షణమే వాళ్ళపై చర్యలు ఉంటాయని అటువంటి సందర్భంలో రాజకీయ ఒత్తిళ్లకు స్థానిక కార్యకర్తల ఒత్తిళ్లకు తలవగి ఇండ్లు మంజూరి చేయవద్దని ఆయన సూచించారు. మొదటి ప్రాధాన్యతలో సెంటు భూమి లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని గుడిసె ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రభుత్వం నుంచి విడతల వారీగా రూ. 5 లక్షలు మంజూరు చేస్తుందని, ఇందుకోసం ఎవరికీ ఒక రూపాయి కూడా చెల్లించవలసిన అవసరం లేదని మంత్రి లబ్ధిదారులకు సూచించారు. ఇల్లు లేని అత్యంత నిరుపేదలకే ఇవ్వాలి అని తెలియజేశారు. .ఆరోగ్య ఉప కేంద్ర భవనాన్ని ప్రారంభించిన మంత్రి. బొల్లారం గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన పల్లె దవాఖాన భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. బొల్లారం గ్రామంలో జెడ్పి ఉన్నత పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం రూ.5లక్షలతో చేపట్టిన పనులకు మంత్రి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఆర్డీవో సుబ్రహ్మణ్యం, పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్ మల్లయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు, డాక్టర్ వంశీకృష్ణ పంచాయతీరాజ్ ఏఈ బత్తుల విజయ్ కుమార్ ఇంజనీరింగ్ అధికారులు, మండల తహసిల్దార్, వరలక్ష్మి ఎంపీడీవో, శ్రీనివాసరావు మాజీ మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నారాయణరెడ్డి, మాజీ రైతుబంధు అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య, గడ్డపాసాపురం ,చిదంబర రెడ్డి ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోదల వీరయ్య యాదవ్, గ్రామ అధ్యక్షుడు నక్క విష్ణు ,రవీందర్ రెడ్డి, భరత్ కుమార్ రెడ్డి, మునిగొండ గోపి, ఎత్తం వెంకటేష్ ,కావలి మహేష్ నాయుడు, సుదర్శన్ రెడ్డి, బాల్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి ,వెంకట రాజయ్య, రామి రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.



పల్లె ధవాఖానను ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

## హామీలన్నీ అమలు పరుస్తాం..

**- నిజం తెలిసే లోగా అబద్ధం ప్రపంచాన్ని చుట్టి వస్తుంది: ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు24,ప్రభాతవార్త :** నిజం తెలిసే లోగా అబద్ధం ప్రపంచాన్ని చుట్టి వస్తుందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన వ్యక్తి, ఒక ఆటో డ్రైవర్ కు ఫిట్స్ వస్తే ఆ వ్యక్తిని ఎరువులు కొనుగోలు కేంద్రం దగ్గరకు తీసుకొచ్చి, యూరియా కోసం వచ్చిన రైతు స్పృహ తప్పి పడిపోయాడు అని అందరినీ నమ్మించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని హన్వాడ మండల కేంద్రంలో జరిగిన రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ - మిగతా3లో..



## ప్రాజెక్టులకు జలకళ

**- జూరాలకు 3,72,000క్యూసెక్కుల ఇన్‌ఫ్లో**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 24,ప్రభాతవార్త :** ఉమ్మడి పాలమూరు ప్రాజెక్టులు జలకళను సంతరించుకుంటున్నాయి.ప్రాజెక్టులకు ఎగువ ప్రాంతం నుంచి వరద పోటెత్తడంతో నిండుకుండలను తలపిస్తున్నాయి.ప్రియదర్శిని జూరాల డ్యామ్ నిండుకుండను తలపిస్తున్నది. దీంతో 37గేట్ల ద్వారా దిగువన శ్రీశైలం జలాశయానికి నీటి విడుదల కొనసాగుతున్నది. ఆదివారం జూరాలకు 3,72,000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల కెపాసిటీ 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 2.878టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. స్పిల్ వే ద్వారా ,53,753క్యూసెక్కుల నీటి విడుదల చేశారు. అదేవిధంగా ఎడవ కాలువకు 820,క్యూసెక్కులు, కుడి కాలువకు 490క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 3,55,524క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.

# కాంగ్రెస్ హయాంలోనే గ్రామాల రహదారులకు మహర్ధశ

- రూ.2కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం
- పనుల జాతరలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



బీటీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి,ఆగస్టు 24 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే గ్రామాల రహదారులకు మహర్ధశ చేకూరిందని, గత ప్రభుత్వ హయంలో రవాణా సౌకర్యం సరిగ్గా లేక అనేక ఇబ్బందులు పడ్డామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలో గ్రామీణ ప్రాంతాలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను కేటాయించి అభివృద్ధి చేపడుతుందన్నారు. ఆదివారం కల్వకుర్తి మండలంలో నిర్వహించిన పనుల జాతరలో భాగంగా గౌరవ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. కల్వకుర్తి మండలం యంగంపల్లి వద్ద రూ.2కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగంపల్లి-జిల్లేల రహదారికి శంకుస్థాపన చేశారు. ఈ రహదారి పూర్తయితే గ్రామీణ ప్రజలకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు వ్యవసాయ, వాణిజ్య రవాణాకు కూడా అనుకూలమవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జీడిపల్లి తాండలో నూతన అంగన్‌వాడి భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల శ్రేయస్సు, పోషకాహార లోపాల నివారణ, చిన్నారుల విద్యా అభివృద్ధి దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. వెంకటాపూర్ తాండలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. స్థానిక ప్రజలతో మాట్లాడిన ఆయన, గ్రామ పంచాయతీ భవనం ప్రజలకు మరింత సౌకర్యవంతంగా సేవలు అందించే కేంద్రంగా నిలుస్తుందని అన్నారు. అనంతరం జిల్లెల్ల గ్రామంలో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యులు ఠాకూర్ బాలాజీ సింగ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, నాయకులు గోళి సురేందర్ రెడ్డి, అశోక్‌రెడ్డి, జిల్లెల్ల రాములు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి శ్రీహరి

## దాసర్‌పల్లిలో విషాదం

**తల్లి, కూతురు రోడ్డు ప్రమాదంలో మృతి**

**ఘటనపై హుటాహుటిన స్పందించిన మంత్రి వాకిటి శ్రీహరి**

**మక్తల్ టౌన్,ఆగస్టు 24 ప్రభాతవార్త:**మక్తల్‌మండలం దాసర్‌పల్లి గ్రామానికి చెందిన మహిళ మడుగు తిప్పమ్మ,ఆమె కుమార్తె కృష్ణవేణిలను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ఈ విషాదకర సంఘటన విషయం తెలిసిన వెంటనే తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, డైరీ అభివృద్ధి, క్రీడలు మరియు మత్స్యశాఖ మంత్రి డా.వాకిటి శ్రీహరి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. మంత్రి వాకిటి శ్రీహరి స్వయంగా పర్య వేక్షిస్తూ మృతదేహాలను ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు.

## సామాజిక మాధ్యమాల్లో కించపరిచే పోస్టులకు పాల్పడరాదు

### జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ హెచ్చరిక



**నారాయణ పేట, ఆగస్టు 24 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాలు మిలాద్ ఉన్ నబీ పండుగల సందర్భంలో సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత వ్యాఖ్యలు రెచ్చగొట్టే పోస్టులు దుష్ప్రచారం చేయకూడదని జిల్లా ప్రజలకు తెలిపారు. ఫేస్‌బుక్, ట్విటర్, ఇన్‌స్టాగ్రామ్ వాట్సాప్ గ్రూపులలో ఇతరులకు ఇబ్బంది కలిగించే వర్గాల మనోభావాలు దెబ్బతీసే పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. తెలియని వీడియోలు ఫోటోలు ఫార్వర్డ్ చేసిన వారిపైనా కేసులు నమోదు చేయబడుతాయి. గ్రూప్ అడ్మిన్లు కూడా బాధ్యులవుతారు సోషల్ మీడియాను మంచి పనులకే ఉపయోగించాలి లేకపోతే సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ ద్వారా నిఘా వేసి వెంటనే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. 24/7 పోలీసులు పరిస్థితిని పరిశీలిస్తూ ఉంటారని తెలిపారు. అలాగే ప్రజలు అత్యవసర సందర్భంలో డయల్ 100 లేదా కంట్రోల్ రూమ్ నంబర్ 8712670399 కి ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించవచ్చని ఎస్పీ సూచించారు.

## బిజెపి కార్యకర్త కుటుంబానికి పరామర్శ

**దేవరకద్ర,ఆగస్టు 24 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు వడ్ల బాలరాజ్ చారి కూతురు అక్షర, అనారోగ్యంతో బాధపడుతూ ఉండడంతో విష యం తెలుసుకున్న భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎగ్గని నరసింహులు ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ కార్యకర్త కుటుంబాలకు ఎటువంటి ఇబ్బందులు అయినా, కార్యకర్తల కుటుంబాల్ని, కార్యకర్తలను కాపాడుకుంటానని, కార్యకర్త లేనిదే పార్టీ లేదు, భారతీయ జనతా పార్టీలో ఉన్న కార్యకర్తలు అందరూ నిరుపేద కుటుంబానికి చెందినవారు. వారికి అండగా నేనుంటానని హామీ ఇచ్చారు. అదేవిధంగా రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు కష్టపడి పనిచేసి, మన అభ్యర్థులను గెలిపించగలరని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరకద్ర నియోజకవర్గ నాయకులు ఎగ్గని నరసింహులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కృష్ణారెడ్డి, గొల్ల ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి, వడ్ల బాలరాజు చారి, బట్టుపల్లి శ్రీనివాస్ రెడ్డి, బాలరాజు, కావలి మహేష్, వీరన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### శివరామాంజనేయా ఆలయంలో

## నిత్య భజన అన్నదాన కార్యక్రమాలు



భజన బృందానికి సన్మానం చేస్తున్న దృశ్యం

**గద్వాల టౌన్, ఆగస్టు 24, ప్రభాత వార్త:** పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలో గల శ్రీ శివరామాంజనేయ ఆలయంలో నిత్య భజన అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు తెలిపారు. 19వ వార్డ్ రాధాకృష్ణ కాలనీలో గల శ్రీశివ రామాఆంజనేయ ఆలయంలో గత నెల రోజులుగా సుబ్బారెడ్డి, బళ్లారి సుధాకర్ బృందం వారిచే నిత్యం సాయంకాలం భజన, ప్రతి పౌర్ణమి సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం అన్నదానం వైభవోపేతంగా నిర్వహించబడుతున్నాయన్నారు. ఈ ఆలయం దినదిన అభివృద్ధి చెందుతున్నదనీ, దీనికి గాను నాతో పాటు ముత్యాల వెంకట్ రామ్ రెడ్డి, సీడ్ బ్రహ్మయ్య, జగదీశ్వర్ రెడ్డి. ఆచారి కృష్ణచారిలు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు వారు తెలిపారు. ఆలయ సేవధికారులుగా బీజేపీ రాఘవేందర్ రావ్, బిలకంటి శ్రీధర్, బీజేపీ శ్యామ్ రావ్, వ్యవహారిస్తున్నట్లు తెలిపారు. అనంతరం భజన బృందనికి ఘన సన్మానం చేశారు.

## దళితవాడలపై అధికారుల నిరక్ష్యం తగదు !

**వడ్డేపల్లి,ఆగస్టు24 ప్రభాతవార్త :**వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామచంద్రనగర్ 9వ వార్డులో తాగునీరు రాక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ కాలనీలో ప్రధానంగా అత్యధికంగా దళితులు నివసిస్తుండడం వల్లే అధికారులు చిన్న చూపు చూస్తున్నట్లు స్పష్టమవుతుందని బిజెపి నాయకులు మండిపడ్డారు. ఆదివారం 9వ వార్డులో వారు పర్యటించి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మిషన్ భగీరథ నీళ్లు సరిగా రావడం లేదని త్రాగడానికి నిత్యవసరాలకు మనిషి చనిపోయిన తర్వాత స్నానం చేయడానికి కూడా నీళ్లు లేక అవస్థలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అధికారులకు ఎన్ని మార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని కాలనీవాసులు వాపోయారు. దయచేసి త్రాగునీరుకు శాశ్వత పరిష్కారం చూపాలని లేదంటే మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తామన్నారు. గతంలో పలు వార్డుల వారిగా సమస్యలు పరిష్కాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ కు పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు బోయ నాగరాజు, బోయ వెంకటేశ్వర్లు సంజన మోహన్ యాదవ్ ,శేఖర్ ఆచారి, అశోక్ కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

### సురవరం ఆశయ సాధనలో శ్రామిక వర్గ ప్రజానీకానికి అండగా ఉంటాం



సురవరం సుధాకర్‌రెడ్డికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**నారాయణ పేట, ఆగస్టు 24 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ చౌక్ వద్ద సిపిఐ అగ్రనేత సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అగ్రనేత మాజీ పార్లమెంట్ సభ్యులు ఎర్రజెండా ముద్దుబిడ్డ కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిపిఐ ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నేతగా ప్రారంభించి సిపిఐ అగ్రనేతగా ఎదిగిన మహానుభావుడు సుధాకర్ రెడ్డి నమ్మిన సిద్ధాంతం కోసం అహర్నిశలు పోరాడిన ఆయన, ప్రజా సమస్యల పరిష్కారాన్నే తన జీవిత ధ్యేయంగా చేసుకున్నారు. ఎర్రజెండా నీడలో సబ్బండవర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడారు. ఆయన నిబద్ధత, ధైర్యం, క్రమశిక్షణ తరతరాలకు స్ఫూర్తి అని పేర్కొన్నారు. సురవరం ఆశయాల సాధనలో శ్రామిక వర్గ ప్రజానీకానికి అండగా ఉంటాం"అని నేతలు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యకర్తలు, హమాలి కార్మికులు పాల్గొన్నారు.

## ఎస్‌టియూ ఆర్థిక సభ్యుడిగా నల్లమల్ల వాసి సుదర్శన్

**ఉప్పునుంతల, ఆగస్టు 24 ప్రభాతవార్త :** స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్‌టియు టిఎస్) స్టేట్ ఫైనాన్స్ మెంబర్‌గా అచ్చంపేట వాసి ఒగ్గు సుదర్శన్‌కు అవకాశం దక్కింది. అచ్చంపేట ప్రాంతవాసి ఒగ్గు సుదర్శన్ ఎస్‌టియు రాష్ట్ర ఫైనాన్స్ మెంబర్‌గా ఎంపిక కావడంతో ఆదివారం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మారావుల ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అదేవిధంగా రాష్ట్ర ఫైనాన్స్ నెంబర్‌గా ఎంపిక కావడం పట్ల ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రావు, మాజీ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ సుదర్శన్, కౌన్సిలర్ రవి శేఖర్, నారాయణ గౌడ్, నందకిషోర్ యాదవ్, శేఖర్, భాస్కర్, రమేష్, నరేందర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, కృష్ణయ్య తదితరులున్నారు.

## పదవీచ్యుతి బిల్లుపై విపక్షాల అభ్యంతరం అర్థరహితం

### బిజెపి జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ

**నారాయణపేట , ఆగస్టు 24 ప్రభాతవార్త:** అవినీతి కేసులో 30 రోజులు జైలుకు వెళితే ప్రధాని, సిఎంతో సహా మంత్రులు పదవీ కోల్పోయే కేంద్రం తెచ్చిన బిల్లుపై విపక్షాలు చేస్తున్న అభ్యంతరా లు అర్థరహితం అని నారాయణ పేట జిల్లా బిజెపి లీగల్ సెల్ కన్వీనర్ నం దు నామాజీ ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. 50 గంటల పాటు అరెస్టయిన ఒక ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగం పో తుందని అలాంటిది ఒక పిఎం,సి ఎం, మంత్రులు పదవి నుంచి దిగి పోకుండ ఎలా ఉంటారని అన్నారు. తప్పు చేస్తే ఎవరినైనా తొలగించే బిల్లును వ్యతిరేకించడం అంటే పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయిన విపక్షాల నాయకులు అవినీతి నుంచి తప్పించుకోవడానికే బిల్లును వ్యతిరేకిన్నారని అన్నారు. ఈ బిల్లును ప్రజలు హర్షి స్తున్నారని అన్నారు. ఈ బిల్లు అమల్లోకి వస్తే దేశవ్యాప్తంగా విపక్షాల ప్రజా ప్రతినిధులు పదవులు కోల్పోతారని అన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లుతో కక్ష సాధింపుకు పాల్పడుతోందని విమర్శించడం అర్థరహితమని అన్నారు. ఈ బిల్లును అందరూ స్వాగ తించాలని కోరారు.

## శ్రీ రంగనాయక స్వామి వారి రథోత్సవం

తిలకించడానికి భారీగా తరలివచ్చిన భక్తులు

నెలరోజుల పాటు మద్యం

మాంసానికి దూరంగా గ్రామ ప్రజలు

స్వామి వారి రథం వేప చెట్టును

తాకగానే వేపాకు తీయగా మారడం ప్రత్యేక విశేషం...



శ్రీ రంగనాయకస్వామి వారు



స్వామివారి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**దేవరకద్ర,ఆగస్టు 24 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం వెంకటాయపల్లి గ్రామ సమీపంలోని ఊరగుట్టపై శ్రీ రంగనాయక స్వామి స్వయంగా వెలిశారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసం నెలరోజుల పాటు స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తారు. అదేవిధంగా అఖండ దీపంను కూడా నెలరోజుల పాటు వెలిగించడం జరుగుతుంది. గ్రామంలోని ప్రజలు నెలరోజుల పాటు మద్యం, మాంసానికి దూరంగా ఉంటారు. ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా శ్రావణమాసం చివరి రోజున స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా స్వామివారి రథోత్సవంను రంగురంగుల పూలు, విద్యుత్ కాంతులతో అలంకరించారు. ఆదివారం తెల్లవారుజామున స్వామి వారి రథోత్సవం ఊరగుట్ట నుండి గ్రామంలోని రచ్చకట్ట వరకు ఊరేగించారు. స్వామి వారి రథోత్సవం రచ్చకట్ట దగ్గర ఉన్న వేప చెట్టును తాకగానే వేపాకు తీయగా మారడం ఇక్కడ ప్రత్యేక విశేషం. స్వామివారి రథోత్సవం తిలకించడానికి జిల్లా నలుమూలల నుండి కాక హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రావడం జరిగింది.

## జిల్లా వాలీబాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక




వాలీబాల్ నూతన కార్యవర్గం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 24 ప్రభాతవార్త:** వాలీబాల్ అసోసియేషన్ నాగర్‌కర్నూల్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ యొక్క పదవీకాలం ముగియడంతో తిరిగి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నాగర్‌కర్నూల్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఎన్నికలకు ఎన్నికల పరిశీలకులుగా తెలంగాణ రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు హనీఫ్, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ పరిశీలకులుగా చిన్న వీరయ్య, నాగర్‌కర్నూల్ జిల్లా డివైఎస్ఓ నుండి అమర్ స్పోర్ట్స్ పరిశీలకులుగా హాజరయ్యారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా పోచప్ప ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, సహాయ కార్యదర్శి, కోశాధికారిగా, నామినేషన్లు రావడంతో వీరికి పోటీగా ఎవరు నామినేషన్ వేయకపోవడంతో జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఎన్నికల అధికారి పోచప్ప ప్రకటించారు తదనంతరం జిల్లా నూతన అధ్యక్షులుగా వంకేశ్వరం నిరంజన్, ఉపాధ్యక్షులుగా ఊరుకొండ శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పశుల వెంకటేష్, సహాయ కార్యదర్శిగా వీరప్ప, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, కోశాధికారిగా పోతుల సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులను ఎన్నుకున్నారని తెలంగాణ రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ పరిశీలకులు హనీఫ్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఎన్నికలకు జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష కార్యదర్శులు, నాగర్ కర్నూల్ డివిజన్ ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొత్త యాదగిరిరావు, నాగర్‌కర్నూల్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నరసింహా రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా ఖోఖో అసోసియేషన్ ఇంచార్జ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ సామ రమేష్, లీ.రవికుమార్, సత్యనారాయణ, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ బి.రాజన్ గౌడ్, కృష్ణ, మాజీ కౌన్సిలర్ ఆలూరి నరేందర్, క్రీడాకారులు శ్రీశైలం, ఆనంద్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలి

**ఖిల్లా గణపురం ఆగస్టు 24, ప్రభాతవార్త;** ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి దసరా నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసు కుంటున్న సందర్భంగా గ్రామ గ్రామాన ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలను హిందూ బంధువులుఘనంగా నిర్వహించుకోవాలని విభాగ్ సంఘ చాలా క్ ఏమి రెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బాదం సరోజినీ దేవి ఫంక్షన్ హాల్ లో మండల సర్వ స్వయం సేవకుల సమావేశం నిర్వహించారు. కండ కార్యనిర్వాహకులు గాండ్ల భాస్కర్ జీతో కలిసి ఆయన మాట్లాడారు. భారతదేశాన్ని స్వశక్తి దేశంగా నిలబెట్టడానికి ఆర్‌ఎస్‌ఎస్ 1925 సంవత్సరం నుండి శాఖ అనే మాధ్యమం ద్వారా వ్యక్తి నిర్మాణం హిందూ సంఘటన పని నిరంతరం చేస్తున్నదని మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వివిధ రంగాలలో వివిధ సంస్థలను నెలకొల్పి దేశభక్తి స్వాభిమానం గల కార్యకర్తలను తయారు చేస్తుందన్నారు. ప్రపంచంలోని హిందువులను సంఘటితం చేస్తూ అతిపెద్ద స్వచ్ఛంద సంస్థగా నిలబడిందని శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రతి గ్రామానికి హిందుత్వ జాగరణ వ్యాప్తి జరగడానికి శతాబ్ది కార్యక్రమాలను నిర్వహించబోతున్నదని ఇట్టి కార్యక్రమంలో స్వయంసేవకుగా హిందువుగా పాల్గొనడం మన అదృష్టంగా భావించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన పలు గ్రామాల నుంచి ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు విశ్వహిందూ పరిషత్ అభిమానులు పెద్ద మొత్తంలో పాల్గొన్నారు. ఫోటో రైటప్;24గద్వాల్5;శతాబ్ది ఉత్సవాల కోసం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు.

## జ్ఞాన వేధిక అచ్చంపేట కమిటీ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు



స్వామి వారి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

**అచ్చంపేట,ఆగస్టు24 ప్రభాతవార్త:**త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక అచ్చంపేట కమిటీ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణుడి ప్రతిమను శ్రీ కృష్ణ జన్మాష్టమి రోజు ఆగస్టు 16న శనివారం అచ్చంపేట పట్టణంలోని టీచర్స్ కాలనీలో టీచర్ గార్లపాటి సాయిశంకర్ శ్రేష్టి ఇంటి దగ్గర వేదిక నిర్మించి కొలువు తీర్చి స్వామికి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం జ్ఞాన రీత్యా నిత్య పూజలు, భగవద్గీత శ్లోక పారాయణం చేసి 9వ రోజు ఆదివారం శ్రీకృష్ణ ప్రతిమ ఊరేగింపు టీచర్స్ కాలనీ గార్లపాటి సాయి శంకర్ శ్రేష్టి ఇంటి వద్ద నుండి బయలు దేరి మెయిన్ రోడ్ మీదుగా బస్టాండ్ వెళ్ళి, రాజీవ్ చౌక్ మీదుగా అంబేద్కర్ చౌరస్తా నుండి, నెహ్రూ చౌరస్తా వరకు వెళ్లి తిరిగి మెయిన్ రోడ్డు మీదుగా టీచర్స్ కాలనీలోని సాయి శంకర్ శ్రేష్టి ఇంటి వద్ద ఉన్న శ్రీ కృష్ణ ప్రతిమ కొలువు ప్రాంగణం వేదిక వరకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు పుర వీధులలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. నేటి ఊరేగింపుతో కృష్ణాష్టమి వేడుకలు ముగిశాయి. ముఖ్య అతిథులుగా మున్సిపల్ మాజీ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు విచ్చేసి స్వామికి కాయ కర్పూరం సమర్పించి పల్లకి సేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక అచ్చంపేట కమిటీ అధ్యక్షులు, సభ్యులు గార్లపాటి సాయి శంకర్ శ్రేష్టి, మనోహర్ శ్రేష్టి, వరుణ్ శ్రేష్టి,పాపిశెట్టి రాధాకృష్ణ శ్రేష్టి, శశి ప్రీతం శ్రేష్టి, పసుపుల మల్లికార్జున శ్రేష్టి, రామ్మోహన్ రెడ్డి, డాక్టర్ రవి, నవీందర్, సురేష్, ఆత్మరామ్, ఉషన్న, వెంకటయ్య, తిరుపతి, నాగరాజు, రమాదేవి, స్వప్న, ప్రసన్న, సుష్మ, శిరీష, మంజుల, జంగమ్మ, పార్వతమ్మలు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ లక్ష్యం : ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



పెద్దాపూర్ అంగన్‌వాడీ భవనానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

**వెల్దండ,ఆగస్టు 24 ప్రభాతవార్త:**గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పనుల జాతర కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్దాపూర్ గ్రామ పంచాయతీలో రూ.12 లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ బిల్డింగ్‌కు భూమి పూజ, కంటోనీపల్లి గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకుల పాలనలో గ్రామాలకు సరైన రహదారులు లేక పోవడంతోపాటు గ్రామాలు వెనుకబాటుకు గురయ్యాయని,కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినవెంబడే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకమైన నిధులు కేటాయించి పనుల జాతర్లలో అనేక నిధుల ద్వారా గ్రామాలను అధిక నిధులు తీసుకువచ్చి అన్ని రంగాలలో అభివృద్ధి పరచుకుంటామన్నారు. కార్యక్రమంలో పీసీసీ మెంబర్ ఠాగూర్ బాలాజీ సింగ్, మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా సంజీవ్‌యాదవ్, సురేందర్ రెడ్డి,రామకృష్ణ, పర్వత్ రెడ్డి, మట్ట వెంకటయ్య గౌడ్, తహసిల్దార్ కార్తీక్ కుమార్, ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ, చెర్కొ రాజశేఖర్, కిషోర్ రెడ్డి, పుల్లయ్య హరి కిషన్ నాయక్, పోలే రాజు, కాటిక రామస్వామి, లక్ష్మణ్ స్వామి, రాజుయాదవ్, శ్రీనునాయక్, ఎంపీఓ లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి ఫయాజ్ తో పాటు తదితరులున్నారు.

## పిచ్చికుక్కల దాడిలో కాడెద్దు మృతి

**ఉప్పునుంతల, ఆగస్టు 24 ప్రభాతవార్త :** గ్రామాలలో వీధి కుక్కల బెడదకు ఎంతోమంది ఇబ్బందులు పడుతున్న అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉంది. ఆదివారం మండలంలోని మామిళ్ళపల్లి గ్రామానికి చెందిన సామ చెన్నయ్య కు చెందిన కాడెద్దు పిచ్చి కుక్కల దాడికి మృత్యువాత పడింది. ఇప్పటికే 1 లక్ష 50 వేల విలువ గల కాడెద్దులు మృత్యువాత పడగా, ఆదివారం మరో కాడెద్దు పిచ్చుకల దాడికి బలైయింది. ఇంత జరుగుతున్న అధికారులు ఎవరు పట్టించుకోకపోవడం గ్రామస్తులు ఆందోళన చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని పిచ్చికుక్కల స్వైర విహారానికి చెక్ పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని మామిళ్ళపల్లి గ్రామస్తులు ఏ కరువు పెట్టుకుంటున్నారు. ఇప్పటికీ దాదాపు రెండు లక్షల వరకు నష్టం వాటిల్లినట్టు బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## దేవరకద్ర ఎమ్మెల్యే తండ్రి కృష్ణారెడ్డి వర్ధంతి



నివాళులర్పించిన జికేఆర్ ఫౌండేషన్ సభ్యులు

**దేవరకద్ర, ఆగస్టు 24 ప్రభాతవార్త:** దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి తండ్రి గావినోల్ల కృష్ణారెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమం దమగ్నాపూర్ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం దేవరకద్ర ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి,ఎమ్మెల్యే తండ్రి కృష్ణారెడ్డి సేవలను స్మరించుకుంటూ ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన జికేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కోన రాజశేఖర్, దేవరకద్ర పాత్రికేయులు చంద్రశేఖర్, ప్రశాంత్, ఎండి యాకూబ్, రఘువీర్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడలకు నారాయణపేట జట్టు



రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు వెళ్తున్న జట్టు

**నారాయణపేట , ఆగస్టు 24 ప్రభాతవార్త :**నారాయణపేట జిల్లా ఎస్‌జిఎఫ్ అండర్15,అండర్17 బాలురటీమ్స్ ఈనెల24 నుండి 26 వరకు రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొనడానికి ఆదివారం తరలి వెళ్లారు. అంత కుముందు పలువులు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిపోటీల్లో నారాయణపేట జిల్లాకు గుర్తింపును తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా ఎస్‌జిఎఫ్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, పీడీలు రవి కుమార్, రామ్మోహన్, బాలరాజ్, ఆంజనేయులు, సత్యంలు ఉన్నారు.

## పదవీ విరమణ ఉపాధ్యాయుడికి సన్మానం

**నారాయణపేట, ఆగస్టు 24 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణానికి చెందిన ఇటీవల పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు విజయ్ కుమార్‌ను ఆదివారం స్నేహ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆదివారం కేక్ కట్ చేయించి తినిపించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భగా పలువురు మాట్లాడుతూ శేష జీవితం ప్రజా సేవకు అంకితం చేయాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో మిత్ర మండలి సభ్యులు సిద్ధి వెంకట్, రాములు, డి.మల్లేష్ మిర్చి వెంకటయ్య, గుత్తి రమేష్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శీల చంద్రశేఖర్ రెడ్డి, మల్లయ్య తదితరులు ఉన్నారు.

## అంబేద్కర్ సంఘం నూతన కమిటీ ఎన్నిక



అంబేద్కర్ సంఘం నూతన కమిటీ ఎన్నికున్న దృశ్యం

**రాజాపూర్,ఆగస్టు24 ప్రభాతవార్త:**మండల కేంద్రంలో ఆదివారం అంబేద్కర్ సంఘం నూతన కమిటీని మాజీ అంబేద్కర్ సంఘం గౌరవ అధ్యక్షుల సమక్షంలో ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా పోలేపల్లికృష్ణ ప్రధానకార్యదర్శిగా భీమగల్ల నరసిం హులు ఉపాధ్యక్షులుగా 1.రాఘవేందర్ 2. గుర్రం కాడి యాదగిరి కోశాధికారిగా.చెన్నవెల్లి జంగయ్య సహాయ కార్యదర్శిగా రాచమల యాదగిరిలను మండలంలోని అన్నిగ్రామాల అంబేద్కర్ సంఘం సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

## గణేష్ ప్రతిష్టాపనలో వేద పండితుల సూచనలు పాటిద్దాం

### విశ్వహిందూ పరిషత్

**నారాయణపేట,ఆగస్టు 24 ప్రభాతవార్త :** వేద పండితులు సూచించిన సమయం ప్రకారం గణేష్ ప్రతిష్టాపన పూర్తి చేసుకోవాలని విశ్వహిందూ పరిషత్ నారాయణపేట జిల్లా శాఖ సూచించారు. ఆదివారం ఓ ప్రకటనలో విశ్వహిందూ పరిషత్ నగర ఉత్సవ కమిటీ సభ్యులు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేద పండితుల సూచించిన ప్రకారం గణేష్ ప్రతిష్టాపన ఈ నెల 27న ఉదయం 6 గంటల నుండి 9 గం.ల వరకు, 10 గంటల నుండి 12.30 నిమిషాల వరకు సాయంత్రం 6 గంటల నుండి 9 గంటల వరకు ప్రతిష్టాపన పూర్తి చేయాలన్నారు. నిమజ్జనోత్సవం 5.09.2025 నాడు రాత్రి 9 గంటల నుండి ప్రారంభించాలన్నారు.

## కేంద్ర ప్రభుత్వ సరఫరాలో జాప్యం వల్లే యూరియా కొరత



విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి

**ఆత్మకూర్ ఆగస్టు 24, ప్రభాతవార్త:** ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో అక్కడక్కడ యూరియా కొరత ఏర్పడం కేంద్ర ప్రభుత్వం సరఫరా చేసే యూరియాలో జాతీయ మూలంగానే యూరియా కొరత కనబడుతుందని ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. ఆదివారం రోజు ఆత్మకూరు పట్టణంలోని సహకార సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జూలై చివరి నాటికి 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను తెలంగాణ రాష్ట్రానికి సరఫరా చేయాల్సి ఉండగా ఆగస్టు 20వ తేదీ నాటికి కేవలం ఎనిమిది లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా చేసిందని తద్వారా యూరియా సరఫరా లో కొంత జాప్యం జరుగుతున్నాయి విషయం వాస్తవమేనని ఆయన అంగీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక కోటి 20 లక్షల ఎకరాలలో రైతులు సాగు చేశారని ఇందుకుగాను కేంద్ర ప్రభుత్వం సరఫరా చేసిన యూరియాకు ఏ మాత్రం సరిపోవడంలేదని యూరియా పంపిణీ చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాన్ని కాదని కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తేనే రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేయడానికి వీలు కుదురుతుందని ఆయన అన్నారు.అంతేకాకుండా గతవారం ఏకధాటిగా పది రోజులపాటు ముసురు వర్షాలు కురియడంతో రైతులు యూరియాకు పెద్దగా ఇబ్బంది పడలేదని ఒక్కసారిగా వర్షాలు నిలిచిపోవడంతో వరి నాట్లకు యూరియా వేసేందుకు రైతులు ఎగబడడం కూడా ఒక కారణంగా ఉందని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాకు ఇప్పటికే నాలుగు వేల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశామని మరో రెండు మూడు రోజుల్లో మరో నాలుగు వేల మెట్రిట్ టన్నుల యూరియాను సరఫరా చేయడం జరుగుతుందని రైతులు ఏ మాత్రం దిగాలు పడకూడదని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తుందన్న నెపంతో రైతులు ఒక్కసారిగా సహకార సంఘ కార్యాలయాలకు యూరియా కొరకు ఎగబడడం కూడా యూరియా కొరత ఉంది అని చెప్పడానికి ఒక ఉదాహరణగా ఆయన పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా ఆత్మకూర్ సహకార సంఘ అధ్యక్షులు గాడి కృష్ణమూర్తి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మొగిలి గంగాధర్ గౌడ్, మక్తల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు తులసిరాజు యాదవ్, ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్, పట్టణ అధ్యక్షులు నల్లగొండ శ్రీనివాసులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు గణేష్ వెంకట నరసింహారావు తదితరులతో పాటుగా పలువురు నాయకులు పాల్గొన్నారు.

